ఉండిలో లోఓల్టేజ్ సమస్యకు చెక్

- 4 కొత్త సబ్ స్టేషన్‌లు, 120కి పైగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- పాత సబ్‌స్టేషన్లలో మెగావాట్‌ల పెంపు
- విద్యుత్ సరఫరా విషయంలో ఆక్వా రైతుల హర్షం


గుమ్ములూరు రోడ్డులో కొత్తగా ప్రారంభించిన విద్యుత్ సబ్ స్టేషన్


కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో లో ఓల్టేజీతో పాటు ఇతర విద్యుత్ సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిష్కారం లభించింది. గతం టీడీపీ హయాంలో లోఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. లోఓల్టేజ్ సమస్యలతో పరిశ్రమలు జనరేటర్లతో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఉక్కబోత వాతావరణంలో ప్రజలు అల్లాడిపోయేవారు. గృహావసరాలకు సరిపడే విద్యుత్ సరఫరా అయ్యేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చొరవతో నియోజకవర్గంలో ఆకివీడు(గుమ్ములూరు రోడ్డు), తాళ్లకోడు, యండగండి, విస్సాకోడేరు గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్లను నిర్మాణం చేపట్టి త్వరితగతిని పూర్తి చేసి ప్రారంభించారు. తాళ్లకోడులో 220/33 కేవీ భారీ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. వీటితో పాటు పాత సబ్ స్టేషన్లలో కొత్తగా పవర్ మెగా వాట్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఉండి 220/132 కేవీ సబ్ స్టేషన్‌లో 100 ఎంవీఏ ట్రాన్స్‌ర్మర్ స్థానంలో 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. తాళ్లకోడులోని 220/33 కేవీ సబ్ స్టేషన్‌లో 80 ఎంవీఏ, 50 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, చినకాపవరంలోని సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తో పాటు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్, కోలమూరులో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ఆయా సబ్ స్టేషన్ల నుండి సరఫరా అయ్యే విద్యుత్ ను ప్రజలకు నాణ్యంగా అందజేసేందుకు నియోజకవర్గంలో కొత్తగా 120 మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాతో పాటు ఆక్వా రంగానికి నాణ్యమైన విద్యుత్ అందజేస్తూ గృహావసరాలకు లోఓల్టేజ్ లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలో విద్యుత్ కోతలు లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం



ప్రజలకు, ఆక్వా రైతులుకు నాణ్యమైన విద్యుత్ అందజేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. అవసరమైన చోట కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయించాం. పాత సబ్ స్టేషన్ల కెపాసిటీ పెంచాం. మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ లోఓల్టేజ్ సమస్య లేకుండా చేస్తున్నాం.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆక్వాకు నిరంతర విద్యుత్



ఆక్వా రంగానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆక్వా రంగానికి విద్యుత్ సమస్య తగ్గింది. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సబ్సిడీపై విద్యుత్ ఛార్జీల వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ చర్యల వల్ల ఆక్వా రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు చేసుకుంటున్నారు.

– కూనపరాజు ప్రసాదరాజు, ఆక్వా రైతు, తరటావ

లోఓల్టేజ్ సమస్య లేదు

విద్యుత్ సమస్య గత ఐదేళ్లుగా లేకుండా చేశాం. ఇటీవల కాలంలో కొత్త సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మెగా ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఉండి, ఆకివీడు 220/133, 33 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటు, మినీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో సమస్య తొలగింది. ఇంకా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం మేరకు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం.

– పీర్ అహ్మద్ ఖాన్, డీఈ ట్రాన్స్‌కో, భీమవరం

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం


సభలో మాట్లాడుతున్న సీడీపీఓ సీహెచ్ ఇందిర

యలమంచిలి: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమనే సంగతి ప్రతి ఒకరికీ వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యలమంచిలిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార ఫలితాలను సంపూర్ణ పద్ధతిలో మెరుగుపరుద్దాం అనే నినాదంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆమె కోరారు. దేశాభివృద్ధి చెందాలంటే ఆరోగ్యకరమైన యువతతోనే సాధ్యమన్నారు. యువత ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి కడుపులో ఉన్న సమయం నుంచే బలవర్థక ఆహారం అందించాలన్నారు. ఈ విషయాన్ని తల్లులందరికీ వివరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహ్మద్ హసీనా, మోహన, తులసి, మంగ, శ్రీదేవి పాల్గొన్నారు.

వడలిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


వడలిలో ఎస్వీకేపీ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రస్తుతం ట్విట్టర్, ఫేస్‌బుక్‌లను ఏవిధంగా జాగ్రత్తగా ఉంచుకుంటున్నామో, అదేవిధంగా భాషను సరిగా ఉపయోగించుకోవాలని లేదంటే ఇబ్బందులు తప్పవని విశ్వతేజ తెలుగు అధ్యాపకుడు వి.తీష్ అన్నారు. ఆదివారం వడలిలో ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు భాషపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవను అలవర్చుకొని వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్ఎస్ శ్రీనివాస్, వి.వీరయ్య, టి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ పథకాలు

మొగల్తూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని సర్పంచ్ పడవల మేరీ తెలిపారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు ప్రాంతంలో పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబం పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు ఇంటికి వెళ్లి బ్రోచర్‌లను అందించారు.

నరసాపురంలో...

నరసాపురం: పట్టణంలోని 25వవార్డులో స్థానిక కౌన్సిలర్ యర్రా ఉమ ఆదివారం ప్రభుత్వ పథకాలను ఇంటిటికీ తిరిగి వివరించారు. నవరత్నాల పథకం ద్వారా ప్రతి ఇంటికీ అందుతున్న పథకాలను వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుని, మన భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నేత యర్రా శ్రీను, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

13న మెగా జాబ్‌మేళా

పెంటపాడు: స్థానిక డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్. ఇందిరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో ఫార్మా, హెటిరోలాబ్స్, ఆస్ట్రోటెక్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ చదివిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మళ్లీ మళ్లీ జగన్ పథకాలు కావాలని కోరుకోండి


మహిళలకు నమస్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: 'దండం పెట్టి చెబుతున్నా... మళ్లీ మళ్లీ జగన్ పథకాలు రావాలని, కావాలని కోరుకోండి. మీ జీవితాలు సుఖంగా సాగిపోవాలంటే జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని భగవంతుడ్ని ప్రార్థించండి' అంటూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మహిళలను కోరారు. మండలంలోని నందమిల్లిపాడులోశనివారం జరిగిన మహిళా సదస్సులో అధిక శాతం పాల్గొన్న మహిళలకు ఆయన అభివాదం చేశారు. రెండు చేతులూ జోడించి మహిళలందరికీ విజ్ఞప్తి చేశారు. జగన్ ఐదేళ్ల పాలన మహిళామణుల దేనన్నారు. అన్ని పథకాలు మహిళల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. జగన్ బటన్ నొక్కితే మహిళ ఖాతాలో సొమ్ము జమైనట్లేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ, ప్రతీ కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధిపొందారని చెప్పారు. ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి మార్గమని, నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి చెందితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని జగన్ భావించినందునే మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పీవీఎల్ చెప్పారు.

వైభవంగా శక్తీశ్వరుని తెప్పోత్సవం


యనమదుర్రులో హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీ పార్వతీ సమేత శక్తీశ్వర స్వామి

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతి సమేత శక్తీశ్వరుని ఆలయ వద్ద శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శక్తిగుండం హంస వాహనంపై స్వామివార్లు వైభవంగా ఊరేగారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల సత్యనారాయణ, కొండమంచిలి తమ్మిరాజులు శక్తీశ్వరస్వామికి సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు సామూహికంగా గౌరి, విఘ్నేశ, శని, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదురుగా ఉన్న శక్తిగుండం ప్రత్యేకం పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామివార్లు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, తులా రాంబాబు, యడ్లపల్లి లక్ష్మణస్వామి, బూరాబత్తుల సిరి లక్ష్మి, కంతేటి మొగళ్లమ్మ, కొల్లాటి పెన్నమ్మ, దేవాబత్తుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి


భీమవరంలో విక్టర్ ప్రసాద్, దళిత నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. భీమవరంలో ఆదివారం ఏర్పాటు చేసిన దళిత గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దళితులపై దాడులు ఎక్కడ జరిగినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో శ్మశాన భూమి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్, దళిత నాయకులను సత్కరించారు. అంబేడ్కర్ సెంటర్ నుండి పోలీస్ బొమ్మ, బుధవారం మార్కెట్, వీరమ్మ పార్క్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, తెలంగాణ అధ్యక్షుడు మన్నే శ్రీధర్ రావు, కొమ్మతోటి పౌలు, బురుగుల వెంకటేశ్వరరావు, గోపిజి రమేష్, ఏలేటి న్యూటన్ యోహాన్, గంటా సుందర్ కుమార్, కోరం ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మంచినీటి సరఫరాపై సమీక్ష


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: వేసవిలో గ్రామాల్లో ఎక్కడా మంచినీటి ఎద్దటి సమస్య రాకూడదని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం ముదునూరి తన కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక తయారు చేయాలన్నారు. కాలువలు కట్టేసిన వెంటనే యాక్షన్ ప్లాన్ అమల్లో పెట్టాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాలువలు కట్టేసే లోపు ముందుకు అన్ని ప్రాంతాల్లో మంచినీటి చెరువులు నింపాలని సూచించారు. మంచినీటి ప్రాజెక్ట్‌లకు సంబంధించి అవసరమైన చోట్ల మరమ్మతులు ఉంటే గుర్తించి వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులు కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులను వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.శ్రీనివాస్, ఏఈలు టి.లోకేష్, యు.రవికృష్ణ, ఇరిగేషన్ ఏఈ మోహన్‌కృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాటన్‌పార్కు పనుల పరిశీలన

పట్టణంలోని కాటన్ మున్సిపల్‌పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. ఆదివారం ముదునూరి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఇప్పటికే పార్కును అభివృద్ధి చేశామన్నారు. దీంతో పర్యాటకుల సంఖ్య పెరిగిందని చెప్పారు. పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని కలిగించే విధంగా పార్కును మరింత అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎన్నికల్లో హింసకు పాల్పడితే చర్యలు


దొడ్డనపూడిలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: రాబోయే సాధారణ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆకివీడు రూరల్ సీఐ కెవివిఎస్ సత్యనారాయణ అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూరల్ సీఐ ఆధ్వర్యంలో ఆదివారం 70 మంది పారామిలటరీ పోలీసు సిబ్బందితో సమస్యాత్మక గ్రామాలైన ఏలూరుపాడు, దొడ్డనపూడి, సీసలి, కోమటిగుంటల్లో ఎస్సై వీఎస్ వీరభద్రరావు నేతృత్వంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కవాతు ఆయా గ్రామాల్లో పురవీధుల్లో నిర్వహించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రాబోయే ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా శాంతియుత వాతావరణంలో ఓటేసేందుకు పటిష్ట భద్రతలు తీసుకుంటున్నామని, గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

విద్యా సమాఖ్య ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు


ప్రశ్నాపత్రాలు అందిస్తున్న విద్యా చైతన్య సమాఖ్య ప్రతినిధులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి నిరంతరం కష్టపడితేనే అనుకున్న ఆశయం సాధించగలమని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కష్టపడుతూ ఉంటే ఏదో ఒకరోజు తప్పని సరిగా ఫలితం మన చెంతకే చేరుకుంటుందన్నారు. చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పరీక్షకు సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పాలకొల్లు డివిజన్ పరిధిలో గల పాలకొల్లు పట్టణం, మండలం యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7 మరియు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్ష అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. పనస శ్రీనివాస్, మంచెం హేమ నాగకృష్ణ సాహితీష్, బర్ల త్రినాథ్‌లో స్మారకంగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, మంచెం కనకరాజు, వంగా కరుణ్‌కుమార్, దిరిశాల వెంకటప్రసాద్, చేగొండి కరుణకుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చేసిన మేలు మరువలేం


దారితిప్పలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజి

మొగల్తూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరువలేమని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ తెలిపారు. కాళీపట్నం భూ సమస్యలను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిన సందర్భంగా కాళీపట్నం రెవెన్యూ గ్రామాల రైతులుతో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2006లో కాళీపట్నం భూముల సాగు చేసుకుంటున్న రైతులకు హక్కు కల్పించేలా కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసి జీఓ 1558 జారీ చేశారన్నారు. అయితే ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ తరుపున ఒక వ్యక్తి ఉన్నత న్యాయస్థానానికి వెళ్లడంతో ఆ జీఓపై స్టే రావడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. తిరిగి చీఫ్ విప్ ప్రసాదరాజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో కాళీపట్నం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు జీఓ-7 జారీ చేయించారన్నారు. ఈ జీఓ ఫలితంగా 1945 నాటికి ఈ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతుల హక్కు పత్రాలు పరిశీలించి రైతులకు పట్టాలు ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాళీపట్నం రైతుల సమస్యల పరిష్కారంగా కృషి చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, చీఫ్ విప్ ప్రసాదరాజుకు రుణపడి ఉంటామన్నారు. మొగల్తూరు సొసైటీ చైర్మన్ మోటుపల్లి రాంభాస్కరరావు మాట్లాడుతూ 1945 కటాఫ్ డేట్ గా నిర్ణయించి రైతులకు న్యాయం చేయడంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషి ఎంతో ఉందన్నారు. కాళీపట్నం సొసైటీ చైర్మన్ దొంగ నాగముని మాట్లాడుతూ కాళీపట్నం భూములు విషయంలో ప్రతిసారి ఏదో రకంగా ప్రకాశం ల్యాండ్ లెస్‌పూర్ సొసైటీ పేరుతో ఒక వ్యక్తి అడ్డుకోవడం అలవాటుగా మారందన్నారు. గతంలో తనను కాళీపట్నం సొసైటీ అధ్యక్షుడిని చేస్తే కోర్టులో వేసిన పిటీషన్‌ను ఉపసంహరించుకుంటానని హామీ ఇచ్చి పదవి చేపట్టిన తరువాత ఎదురుతిరిగాడన్నారు. అలాంటి వ్యక్తి పేదలకు భూములు పంచాలని కోరుతూ కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. కాళీపట్నం రెవెన్యూ గ్రామాల రైతులు పడుతున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి చీఫ్ విప్ ప్రసాదరాజు రైతులకు భూ హక్కు కల్పిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్‌లు చేయించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సరిపల్లి సుబ్బరాజు, కోడె మదన్‌మోహన్, జక్కంశెట్టి ఏడుకొండలు, పడవల సత్యనారాయణ, లింగం ఏసుబాబు, రేవు నారాయణ మూర్తి, రామాని మహేష్, కొప్పాడ గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆచంటలో ఎన్నికల ప్రచారం షురూ

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికలకు ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎన్నికల శంఖారావం సోమవారం పూరించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు సిద్ధాంతం సంపత్ వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహించి, దొంగరావిపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ఇంటింటికీ ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఆచంట నియోజకవర్గంలో ఇప్పటికే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గడపకూ మూడు సార్లు వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు. రెండేళ్ల ప్రభుత్వ సంక్షేమ ప్రగతి, గడపగడపకు మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ వంటి కార్యక్రమాలతో ప్రతీ గడపకు వెళ్లి వారికి అందించిన సంక్షేమాన్ని వివరించారు. అంతకాకుండా, ఇటీవలే మనసారా... వైఎస్సార్ ఆసరా అంటూ తూర్పుపాలెంలో 10 రోజుల పాటు 60 వేల మంది మహిళలకు ఆత్మీయ విందునిచ్చి, చీర సారెతో మహిళలతా మమేకమయ్యారు. దీంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టడంతో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలు నాయకులు పాదయాత్ర ప్రారంభించారు. ప్రతిపక్షాలకు భిన్నంగా మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు శంఖారావాన్ని వినూత్నంగా సోమవారం ప్రారంభిస్తున్నారు. ప్రచారంతో హోరెత్తించనున్నారు. శ్రీరంగనాథరాజు ఇప్పటికే ప్రభుత్వ నిధులతో పాటు, పలు ప్రాంతాల్లో సొంత ఖర్చులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు సైతం నిర్వహించడంతో జనాదరణ రోజురోజుకూ పెరుగుతుంది. దీనికి తోడు ఇటీవల పలు సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమంటూ ఫలితం వస్తుండడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఎన్నికలకు సిద్ధం మటూ మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడం ఖాయమంటూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఎన్నికల శంఖారావం పూరిస్తున్నారు.

నేడు రెండు గ్రామాల్లో పీవీఎల్ పర్యటన

ఉండి: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోమవారం మండలంలోని మహదేవపట్నం, వెలివర్రు గ్రామాల్లో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9:30 గంటలకు మహదేవపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇంటిస్థల హక్కు పత్రాల పంపిణీ, వెలివర్రు వీరపేరంటాలమ్మ అమ్మవారి దేవాలయ ఆవరణలో 10:30 గంటలకు ఇంటి స్థలాల హక్కుపత్రాల పంపిణీ, వీరపేరంటాలమ్మ దేవస్థానం కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీవీఎల్ పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సా ర్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాస్టర్ జార్జ్‌ముల్లర్‌కి డాక్టరేట్

ఉండి: మండలంలోని చెరుకువాడ పేరిష్ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఎన్ జార్జ్‌ముల్లర్‌కు వేదాంత విద్యను అందించే సిరంపూర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించినట్లు ఆయన తెలిపారు.ఈ నెల 9వ తేదీన సీబీఎం(కెనేడియన్ బాప్టిస్ట్ మిషన్), సీబీసీఎన్‌సీ(కెనేడియన్ బాప్టిస్ట్ చర్చస్ నార్తరన్ సర్కార్స్) 150 యేళ్ళ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఉయ్యూరులో జరిగిన సమావేశంలో డాక్టరేట్‌ను అందించినట్లు ఆయన ఆదివారం తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


పెనుమదంలో సింహాద్రికి ఆర్థిక సహాయం అందిస్తున్న గోపి

పోడూరు: మండలంలోని పెనుమదం గ్రామానికి చెందిన కోళ్ల సింహాద్రి ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి గాయపడడంతో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం గోపి సింహాద్రి నివాసానికి స్వయంగా వెళ్లి సహాయాన్ని అందించారు. గోపితో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు పితాని చిన్న రూ.5 వేలు, మండల కార్యదర్శి కొల్లి వెంకట్రావు రూ.1000 కలిపి మొత్తం రూ.16 వేలు అందించారు. సింహాద్రి కోలుకోవడానికి మరోసారి ఆపరేషన్ చేయించాల్సి ఉంటుందని కుటుంబ సభ్యులు వివరించడంతో జగనన్న ఆరోగ్యశ్రీ రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకూ పెంచారని ఎలాంటి ఇబ్బందులు రాకుండా చికిత్స జరుగుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దా ఏసు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు సుబ్బారావు బాబీ, దొంగ భాస్కర్, బీర రాజశేఖర్, పాతంశెట్టి నాగరాజు, అల్లు మురళీ పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందించాలని కోరారు.